‘పొన్నూరు’ను అగ్రస్థానంలో నిలబెడతా

- ఆదరించండి అండగా నిలుస్తా
- టీడీపీ మోసపూరిత వాగ్దానాలు నమ్మొద్దు
- సంక్షేమ పాలన సీఎం జగన్‌తోనే సాధ్యం
- వైఎస్సార్‌సీపీ పొన్నూరు నియోజకవర్గ అభ్యర్థి అంబటి మురళీకృష్ణ



మాచవరం సభలో మాట్లాడుతున్న అంబటి మురళీకృష్ణ


ములుకుదురులో మహిళల సమస్యలు వింటున్న మురళీకృష్ణ

పొన్నూరు: రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకి ఓటేసి గెలిపిస్తే సీఎం జగనన్న స్వరాజ్యంలో పొన్నూరు నియోజకవర్గాన్ని అగ్రస్థానంలో నిలబెడతానని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ అభ్యర్థి అంబటి మురళీకృష్ణ అన్నారు. రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని, అందుకు ఈ ఎన్నికల్లో మీరంతా ఆదరించి ఎమ్మెల్యేగా గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం ఉదయం మండలంలోని ములుకుదురు, సాయంత్రం మాచవరం గ్రామంలో అంబటి మురళీకృష్ణ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు హారతులు ఇచ్చి ఘన స్వాగతం పలికారు. ముందుగా ములుకుదురులోని శివాలయం, చెన్నకేశవ స్వామి ఆలయాల్లో స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించారు. ఐదేళ్ల కాలంలో సీఎం జగన్ ప్రజల కోసం చేసిన సంక్షేమాన్ని వివరించారు. ఆయన చేసిన మేలును మరువద్దని తెలిపారు. సంక్షేమ పాలన కోసం ఎంపీ, ఎమ్మెల్యే పార్టీ గుర్తులైన ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

■ మాచవరం సభలో అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల ఇంటి వద్దకే పాలన తీసుకువచ్చారని తెలిపారు. సచివాలయాలు, ఆర్బీకేలు, వలంటీర్ వ్యవస్థ ద్వారా సంక్షేమ పాలన అందిస్తున్నారని అన్నారు. గత టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీల ద్వారా ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని పేర్కొన్నారు. రెండు దశాబ్దాలకు పైగా పొన్నూరును పాలించిన టీడీపీ నేత ధూళిపాళ్ల నరేంద్ర ప్రజల కోసం చేసిన అభివృద్ధి ఏమీ లేకనే గత ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పారని అన్నారు. ప్రజాదరణ కోల్పోయిన నరేంద్ర ఓటు అడిగే అర్హతను కోల్పోయాడని, మళ్లీ ఎన్నికల్లో ఏ అర్హతతో ప్రజలను ఓటు అడుగుతాడని మండిపడ్డారు. తన కుటుంబం, తన వర్గాల సంక్షేమమే ధ్యేయంగా ప్రజా సంక్షేమాన్ని విస్మరించి పెత్తందారి వ్యవస్థను నరేంద్ర కొనసాగించాడని విమర్శించారు. పాడి రైతులకు చెందిన సంగం డైరీ కబ్జా చేసి, దాని ద్వారా అక్రమంగా ఆర్జించిన సొమ్ముతో డీవీసీ హాస్పిటల్‌ను అభివృద్ధి చేసుకున్నాడని ధ్వజమెత్తారు. పాతికేళ్ల ధూళిపాళ్ల పాలనలో నియోజకవర్గంలో ఎప్పుడైనా సమస్యలు పరిష్కరించారా అని ప్రజలను ప్రశ్నించారు. పాతికేళ్లు పాలించిన నేతకు ఓట్ల కోసం ప్రాధేయపడాల్సిన దుస్థితి రాకూడదని అన్నారు.

■ తనకు ఎలాంటి పదవి లేకపోయినా గత రెండేళ్లుగా ప్రజల కష్టాలను, సమస్యలను తెలుసుకుని సేవలందిస్తూ అండగా నిలిచానన్నారు. ప్రజల ఆర్థిక అభివృద్ధికి తోడ్పాటు అందించేందుకు సీఎం జగన్ అమలు చేసిన సంక్షేమ పథకాలు కొనసాగాలంటే వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ములుకుదురు, మాచవరం సర్పంచ్‌లు కందుల సుబ్బారావు, మిక్కిలి సునీత, వైఎస్సార్‌సీపీ నాయకులు బి.వంశీ రెడ్డి, షేక్ నాజర్, అంబటి వెంకటేశ్వరరావు, దాసరి నారాయణరావు, దాసరి శివరామకృష్ణ, బొద్దులూరి రంగారావు, రుద్రపాటి ఆదిశేషులు, బొద్దులూరి రంగారావు, గుండా బత్తిని శ్యాంసోన్, నారాయణ, కె.అనిల్, అనురాధ, షేక్ బాజి, బత్తుల కుమార్‌బాబు, బందెల ఉదయ్‌శంకర్, తదితరులు పాల్గొన్నారు.

■ మార్కెట్ యార్డులో అరటి రైతుల సమస్యలు వింటూ..

నిడుబ్రోలు వ్యవసాయ మార్కెట్ యార్డులో అరటి రైతులను అంబటి మురళీకృష్ణ పలకరించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నుంచి సంక్షేమ పథకాలు అందుతున్నాయా, లేదా అని ప్రశ్నించారు. సమస్యలు ఏమైనా ఉంటే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, పార్టీ నాయకులు బొనిగల వేణు ప్రసాద్, వడ్రాణం ప్రసాదు, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

శ్రీరంగపురంలో వైభవంగా ప్రతిష్ఠా మహోత్సవం

శ్రీరంగపురం(చేబ్రోలు): చేబ్రోలు మండలం శ్రీరంగపురం గ్రామంలోని మోహనరంగనాయకస్వామి దేవస్థానంలో విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవ కార్యక్రమం శుక్రవారం వైభవంగా జరిగింది. కౌండిన్య మహర్షి సేవిత ప్రసిద్ధి చెందిన పురాతన మోహనరంగనాయక స్వామి దేవస్థానంలో రాజ్యలక్ష్మి తాయారు, గోదాదేవి, పేరంటాళ్లమ్మ అమ్మవార్ల శిలా విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం కనుల పండువగా జరిగింది. గత నాలుగు రోజులుగా దేవదాయశాఖాధికారి పర్యవేక్షణలో పండితులు వివిధ కార్యక్రమాలను నిర్వహించారు. మహా కుంభాభిషేకం, అన్నదాన కార్యక్రమం జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. శ్రీ భూ సమేత మోహనరంగనాయకస్వామి వారి వార్షిక తిరు కల్యాణ మహోత్సవం తదితర కార్యక్రమాలు ఆలయ అర్చకస్వామి శ్రీమాన్ దిట్టకవి సత్యనారాయణాచార్యస్వామి ఆధ్వర్యంలో జరిగింది.

ప్రాంగణ ఎంపికల్లో చలపతి విద్యార్థుల ప్రతిభ



గుంటూరు రూరల్: ప్రతి విద్యార్థికి ఉపాధి లక్ష్యంగా కళాశాలలో విద్యాబోధన జరుగుతుందని చలపతి ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.చంద్రశేఖర్ తెలిపారు. శుక్రవారం నగర శివారుల్లోని లాం నందున్న కళాశాలలో చెన్నైకి చెందిన యాంఫినాల్ సంస్థ నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో తమ కళాశాలకు చెందిన 37 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను కళాశాల చైర్మన్ వైవీ ఆంజనేయులు సెక్రటరీ కరస్పాండెంట్ వై.సుజిత్‌కుమార్, ప్లేస్‌మెంట్ విభాగాధిపతి డాక్టర్ వై.రాకేష్ కుమార్ తదితరులున్నారు.

రైతు శిక్షణ తరగతులు

గుంటూరు రూరల్: వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంట నందున్న రైతు నేస్తం ఫౌండేషన్‌లో సేంద్రియ వ్యవసాయ దిగుబడులకు విలువల జోడింపుపై రైతు శిక్షణ తరగతులు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు నేస్తం ఫౌండేషన్ చైర్మన్ వై.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించే సత్తా సేంద్రియ వ్యవసాయ రంగానికే ఉందన్నారు. శిక్షణలో భాగంగా ఫౌండేషన్‌లో ఏర్పాటు చేసిన గోశాల, కట్టె గానుగతో నూనె తీసే ప్రక్రియ, వానపాముల ఎరువు తయారీ, ఘనజీవామృతం తయారీ విధానం, టమాటా సాసు తయారు చేసే ప్రక్రియ, పుట్టగొడుగుల పెంపకం విధానం, చిరుధాన్యాల ప్రాసెసింగ్ ప్రక్రియ, తేనె టీగల పెంపకం విధానం, బిస్కెట్ల తయారీ విధానం లాంటివి ప్రత్యక్షంగా చూపిస్తూ అందుకు సంబంధించిన సమాచారాన్ని వివరించారు. కార్యక్రమంలో విద్యార్థులు, రైతులు తదితరులున్నారు.

రేపు ఆదికేశవస్వామి వార్షిక శాంతి కల్యాణం

చేబ్రోలు: చారిత్రక ప్రసిద్ధి చెందిన చేబ్రోలులోని శ్రీ భూ నీళా రాజ్యలక్ష్మి సమేత ఆదికేశవస్వామి వారి వార్షిక శాంతి కల్యాణం ఆదివారం ఉదయం జరుగుతుందని దేవదాయశాఖాధికారి శుక్రవారం తెలిపారు. వైభవంగా జరిగే కల్యాణోత్సవానికి చేబ్రోలు పరిసర గ్రామాలకు చెందిన భక్తులు హాజరుకానున్నారు.

పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

గుంటూరు రూరల్: ఆర్థిక సమస్యలతో మనస్తాపం చెంది పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడగా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. సీఐ నరేష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం కాకుమాను మండలం పెద్దివారిపాలెం గ్రామానికి చెందిన వల్లూరి రవిబాబు(27) కూలీ పనులు చేసి జీవిస్తుంటాడు. ఈ క్రమంలో ఆర్థిక ఇబ్బందులు ఎక్కువై మనస్థాపానికి గురయ్యాడు. శుక్రవారం ఉదయం ఇంటి నుంచి గుంటూరు వెళుతున్నానని చెప్పి బయలుదేరి ఏటుకూరు సమీపంలోని పొలాల్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలిసిన కుటుంబ సభ్యులు స్థానికుల సహాయంతో చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుని భార్య మౌనిక ఫిర్యాదు మేరకు ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

రన్ ఫర్ జీసస్ జండా ఆవిష్కరణ



మంగళగిరి: రన్ ఫర్ జీసస్ కార్యక్రమాన్ని ఈనెల 30వ తేదీ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శుక్రవారం తెలిపారు. పట్టణంలోని రాజీవ్ సెంటర్‌లోని తెలుగు బాప్టిస్ట్ చర్చిలో రన్‌కు సంబంధించిన జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పాస్టర్లు ఐ.జోసఫ్, అరుణకుమార్, కె.కరుణా నిధి, తిమోతి, కేకే రవి కుమార్ పాల్గొన్నారు.

జేఎమ్‌జే ఆధ్వర్యంలో అనాథ పిల్లలకు పుట్టినరోజు వేడుకలు



గుంటూరు రూరల్: అనాథలు అభాగ్యులకు తోడుగా మేమున్నామంటూ వారికి ఆదరణ చూపించి ఆదుకోవటం ఎంతో సంతోషకరమని రైల్వే డివిజనల్ మేనేజర్ రామకృష్ణ తెలిపారు. శుక్రవారం నల్లపాడు గ్రామంలోని జేఎమ్‌జే సాంఘిక సేవా సంస్థ ఆధ్వర్యంలో మీతో మేము అనే కార్యక్రమంలో భాగంగా అనాథ పిల్లలకు పుట్టినరోజు వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ అనాథలు, తోటివారికి సహాయం చేయటం ప్రతి ఒక్కరి కర్తవ్యమన్నారు. బాలబాలికలకు చేయూతనందిస్తూ వారి ఉన్నతికి కృషి చేస్తున్న సంస్థను అభినందించారు. కార్యక్రమంలో భాగంగా అనాథ పిల్లలతో కేక్ కట్ చేయించి స్వీట్లు పంచారు. నాబార్డ్ సహకారంతో 55 మంది పిల్లలకు ట్రావెల్ బ్యాగ్స్‌ను, కెనరా బ్యాంక్ ఆధ్వర్యంలో 27 మంది మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. రోటరీ క్లబ్ 70 మందికి గొడుగులను, జేఎమ్‌జే సంస్థ మహిళలు చిన్నారులకు లంచ్‌బాక్స్ వాటర్‌బాటిల్స్‌ను పుట్టినరోజు బహుమతిగా అందజేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్‌కు చెందిన భాస్కర్, బీఎం లీలాకుమారి, శ్యాంసుందర ప్రసాద్, ఫాదర్ ఇన్నారెడ్డి, ఫాదర్ సురేష్‌కుమార్, సిస్టర్ క్లిటస్, సిస్టర్ జెసిత, సిస్టర్ గ్లోరియా, సిస్టర్ సుమిర, సిస్టర్ సరిత, సిస్టర్ మేరికుమారి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి భారీగా చేరికలు



వైఎస్సార్‌సీపీలో చేరిన కార్యకర్తలతో ఎమ్మెల్యే అభ్యర్థి బలసాని కిరణ్‌కుమార్ తదితరులు

జనసేన, టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన లింగాయపాలెం ప్రజలు

గుంటూరు రూరల్: రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం జరగాలంటే జగనన్న ద్వారానే సాధ్యమని నమ్మి ఎందరో వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారని ప్రత్తిపాడు నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి బలసాని కిరణ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం లింగాయపాలెం ప్లాట్స్‌కు చెందిన జనసేన, టీడీపీ కార్యకర్తలు 100 కుటుంబాలు, సుమారు 400 మంది కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరారు. నగరంలోని జేకేసీ కళాశాల రోడ్డులోగల ఎమ్మెల్యే అభ్యర్థి క్యాంపు కార్యాలయంలో పార్టీలో చేరిన వారికి పార్టీ కండువాను కప్పి సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభ్యర్థి మాట్లాడుతూ చంద్రబాబు, దత్తపుత్రుడిని ప్రజలు నమ్మే పరిస్థితి లేదని చెప్పారు. జగనన్న ద్వారానే ప్రతి కుటుంబం ఆర్థికంగా అభివృద్ధి చెందుతుందని నమ్మి ప్రజలు వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో పత్తిపాడు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేసి అఖండ మెజారీతో వైఎస్సార్‌సీపీని గెలిపించి జగనన్నకు గిఫ్ట్‌గా ఇద్దామని పిలుపునిచ్చారు. జగనన్నను ముఖ్యమంత్రిని చేస్తేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. జగనన్న మరోసారి ముఖ్యమంత్రి అయితేనే సంక్షేమ పథకాలు ప్రజలకు అందుతాయన్నారు. చంద్రబాబు మాయమాటలు నమ్మవద్దని ఎన్నికల కోసం పచ్చి అబద్ధాలు చెప్పేవాడు చంద్రబాబు అన్నారు. కార్యక్రమంలో భాగంగా పార్టీలో చేరిన కార్యకర్తలు జై జగనన్న, జై కిరణన్న అంటూ నినాదాలు చేశారు. రానున్న ఎన్నికల్లో ప్రత్తిపాడు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీని అఖండ మెజార్టీతో గెలిపించుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులున్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన అడవితక్కెళ్లపాడు మాజీ ఎంపీటీసీ


మాజీ ఎంపీటీసీ వెంకటరామయ్యను పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి బలసాని

గుంటూరు రూరల్: జగనన్న ద్వారానే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి భారీగా చేరుతున్నారని ప్రత్తిపాడు ఎమ్మెల్యే అభ్యర్థి బలసాని కిరణ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం అడవితక్కెళ్లపాడుకు చెందిన మాజీ ఎంపీటీసీ మట్లు వెంకటరామయ్య టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. నగరంలోని ఎమ్మెల్యే అభ్యర్థి క్యాంపు కార్యాలయంలో ఆయనకు అభ్యర్థి పార్టీ కండువాను కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా వెంకటరామయ్య మాట్లాడుతూ టీడీపీలో దౌర్జన్యాలు, కుట్రలు, కుతంత్రాలు ఎక్కువయ్యాయని చంద్రబాబు చెప్పే అబద్ధాలను భజన చేయటం తప్ప టీడీపీ ప్రజలకు చేసేది ఏమీలేదన్నారు. ఇటీవల నెల రోజుల క్రితం టీడీపీలో చేరానని కానీ నెల రోజులు కూడా ఉండలేకపోయానంటే టీడీపీ ఎంత దౌర్భాగ్య స్థితిలో ఉందో తెలుసుకోవచ్చన్నారు. టీడీపీ కల్లబొల్లి కబుర్లు నమ్మవద్దని అన్నారు. టీడీపీ రౌడీలు ఎమ్మెల్యే అభ్యర్థి క్యాంపు కార్యాలయంపై చేసిన దాడిని తీవ్రంగా ఖండించారు. రామాంజనేయులు రిటైర్డ్ అయినా ఇంకా కలెక్టర్ అనే ఫీలింగ్‌లో ఉన్నాడని రానున్న ఎన్నికల్లో ఆయనకు ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో ప్రత్తిపాడు వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ ఆళ్ల రవిదేవరాజు, కంది సంజీవరెడ్డి, గోరంట్ల డివిజన్ కన్వీనర్ జల్లేపల్లి వేణుబాబు, క్లస్టర్ ఇన్‌చార్జ్ బండారు శ్రీనివాసరావు తదితరులున్నారు.

టీడీపీకి ఎన్నికల కోడ్ వర్తించదా..!




ఉప్పలపాడులో జెండా దిమ్మెలకు, బొమ్మల వేదికలకు టీడీపీ రంగులు


తక్కెళ్ళపాడు గ్రామంలో ఏర్పాటు చేసిన సిమెంట్ బెంచీలు

పెదకాకాని: ఎన్నికల నిబంధనలు పాటించడం లేదని, వలంటీర్లు భోజనాలు చేశారని వలంటీర్లపై అధికారులకు ఉన్నది లేనట్లు, లేనిది ఉన్నట్లుగా సృష్టించి పదే పదే ఫిర్యాదులు చేస్తూ కొందరు నాయకులు పబ్బం గడుపుతున్నారు. ప్రధాన సెంటర్లలో టీడీపీ ఏర్పాటు చేసిన కార్యాలయాలకు, జెండా దిమ్మెలకు, విగ్రహాల ప్రాంగణాలకు వేసిన రంగులు వారికి కనిపించకపోవడం దురదృష్టకరం. తక్కెళ్ళపాడులో ఏకంగా ఊరంతా టీడీపీ రంగులు సర్పంచి పేరుతో సిమెంట్ బెంచీలు పరిచారు. ఇవన్నీ ఎన్నికల కోడ్ ఉల్లంఘన పరిధిలోకి వస్తాయో లేదో అధికారులే చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

ట్రాక్టరు కిందపడి యువకుడి దుర్మరణం

తాడికొండ: ట్రాక్టరు కిందపడి యువకుడు మృతి చెందిన ఘటన తుళ్ళూరు మండలం నెక్కల్లు గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. పవిత్ర శుక్రవారం సందర్భంగా క్రైస్తవు పెదపరిమి నుంచి అనంతవరం వరకు పాదయాత్ర చేపట్టారు. తిరుగు ప్రయాణంలో కంకర లోడుతో వెళుతున్న ట్రాక్టరుపై ఎక్కగా నెక్కల్లు గ్రామ డొంక మలుపు వద్దకు రాగానే యువకుడు ఎర్రమాల చందు(14) జారి పడటంతో ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. ట్రాక్టరుపై నలుగురు యువకులు ఎక్కినట్లు సమాచారం కాగా ఓ యువకుడు జారిపడ్డాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్‌వీఆర్‌జేసీ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేత



గుంటూరు రూరల్: పేద విద్యార్థి ప్రతిభ ప్రోత్సాహకానికి ఉపకార వేతనాలు ఎంతగానో దోహదపడతాయని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజనీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం చౌడవరం గ్రామంలో గల కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నార్త్ సౌత్ ఫౌండేషన్(యూఎస్ఏ) ద్వారా అర్హత కలిగిన 44 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.25 వేల చొప్పున మొత్తం రూ.11,00,000 విలువ గలిగిన చెక్కులను తమ కళాశాల విద్యార్థులకు స్కాలర్‌షిప్ రూపంలో అందించడం ఆనందదాయకమన్నారు. రానున్న కాలంలో మరికొంత మంది విద్యార్థులకు ఏప్రిల్ నెలలో స్కాలర్‌షిప్‌లు అందించనున్నట్లు నార్త్ సౌత్ ఫౌండేషన్ ప్రతినిధులు పేర్కొన్నారు. ఆంధ్ర హాస్పిటల్ డైరెక్టర్ లయన్ డాక్టర్ అచ్యుతబాబు మాట్లాడుతూ పేద విద్యార్థి ప్రతిభకు ఆర్థిక భారం సమస్య కాకూడదని, వారిని ప్రోత్సహించి వారి ఉన్నతే లక్ష్యంగా నార్త్ సౌత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉపకార వేతనాలు పంపిణీ చేయడం జరుగుతుందని అన్నారు. నార్త్ సౌత్ ఫౌండేషన్ విజయవాడ చాప్టర్ కో ఆర్డినేటర్ లయన్ సూరపనేని వెంకటరత్నం మాట్లాడుతూ భారత దేశం మొత్తంలో తమ ఫౌండేషన్ ద్వారా ఉపకారవేతనాల పంపిణీ కార్యక్రమం 30 చాప్టర్ల ద్వారా నిర్వహించడం జరుగుతుందన్నారు. అధిక సంఖ్యలో స్కాలర్‌షిప్‌లను విజయవాడ చాప్టర్ ద్వారా అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ ఆర్ గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్, డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, అధ్యాపకులు విద్యార్థులు నార్త్ సౌత్ ఫౌండేషన్ ప్రతినిధులను ఘనంగా సన్మానించారు.

పోలీస్ కవాతు



మేడికొండూరు: శాంతియుత వాతావరణంలో ఎన్నికలు జరగాలని సీఐ దార్ల జయకుమార్ తెలిపారు. మండల పరిధిలోని పలు గ్రామాల్లో శుక్రవారం కేంద్ర ప్రత్యేక బలగాలతో కవాతు నిర్వహించారు. ఈసందర్భంగా సీఐ జయకుమార్ మాట్లాడుతూ ఎన్నికలు సజావుగా జరిగేందుకు ప్రజలు సహకరించాలని, ఎవరైనా అవాంఛనీయ సంఘటనలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గుండవరంలో ఉచిత పశు వైద్య శిబిరం


వైద్య పరీక్షలు చేస్తున్న పశు వైద్యశాల సహాయ సంచాలకులు సాంబశివరావు

(గుండవరం) చేబ్రోలు: పశువులలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల పశు పోషకులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని చేబ్రోలు ఏరియా పశువైద్యశాల సహాయ సంచాలకులు కాసా సాంబశివరావు తెలిపారు. చేబ్రోలు మండలం గుండవరం గ్రామంలో శుక్రవారం ఉచిత పశు వైద్య శిబిరం జరిగింది. ఈ క్యాంప్‌లో 25 గేదెలకు గర్భకోశ వ్యాధులకు చికిత్స, 15 దూడలకు నట్టల నివారణ మందులు, 15 గేదెలకు సాధారణ చికిత్సలు, రెండు గేదెలకు శస్త్ర చికిత్సలు నిర్వహించారు. పశు వైద్యశాల సహాయ సంచాలకులు కె.సాంబశివరావుతో పాటు గోపాలమిత్ర నాగరాజు, అసిస్టెంట్లు వెంకయ్య, గాయత్రి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. రైతులకు పశువులలో తీసుకోవలసిన యాజమాన్య పద్ధతులు, టీకాలు, దూడల పోషణ, పశుగ్రాసాల ప్రాముఖ్యత, పశు బీమా తదితర విషయాలపై అవగాహన కల్పించారు. పలువురు రైతులకు మిశ్రమ దాణా ప్యాకెట్లను అందజేశారు.

చలపతి ఫార్మసీ కళాశాలలో మలేషియా క్వెస్ట్ యూనివర్సిటీ ప్రతినిధులు


మలేషియా విశ్వవిద్యాలయం ప్రతినిధులను సన్మానిస్తున్న కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: క్లినికల్ ఎడ్యుకేషన్ రంగంలో అంతర్జాతీయ సహకారంతో విద్యార్థి సిబ్బంది పరస్పర చర్యను ప్రోత్సహించడానికి సంస్థలు వివిధ వ్యూహాలను అమలు చేయడానికి దోహదపడతాయని మలేషియా క్వెస్ట్ ఇంటర్‌నేషనల్ విశ్వవిద్యాలయం డీన్ ప్రొఫెసర్ థాతుక్ డాక్టర్ ఎలెన్ మాథ్యూస్ తెలిపారు. శుక్రవారం నగర శివారులోని లాం నందున్న చలపతి ఫార్మసీ కళాశాలను మలేషియా క్వెస్ట్ యూనివర్సిటీ బృందం సందర్శించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల మార్పిడి జాయింట్ రీసెర్చ్ ప్రాజెక్ట్‌లు, అధ్యాపకులకు శిక్షణ తరగతులు ఆసుపత్రులు, ఆరోగ్య సంరక్షణ భాగస్వామ్యం ద్వారా విద్యార్థులు అధ్యాపక సిబ్బంది వివిధ దేశాల సహచరులతో సంభాషించవచ్చన్నారు. విశ్వవిద్యాలయం డైరెక్టర్ డాక్టర్ మహిబూబ్ మహమద్సాకనకల్ మాట్లాడుతూ అంతర్జాతీయ సహకారంతో గ్లోబలైజ్ ల్యాండ్ స్కేప్ సంక్లిష్టతను పరిష్కరించుకోవచ్చన్నారు. డాక్టర్ కోట్ర విజయ్ మాట్లాడుతూ అంతర్జాతీయ భాగస్వామ్యంతో విద్యార్థులు పాఠ్యాంశాల్లో గ్లోబల్ హెల్త్ మాడ్యూల్స్ తదితరాలను వివరించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నాదెండ్ల రామారావు, సెక్రటరీ సుజిత్‌కుమార్ తదితరులు విశ్వవిద్యాలయం బృందాన్ని ఘనంగా సన్మానించారు.

ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ



కాకుమాను: ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో సామాన్య ప్రజలకు ఓటే వజ్రాయుధం అని అలాంటి ఎంతో పవిత్రమైన ఓటు హక్కును ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని నోడల్ అధికారి మోహనరావు అన్నారు. స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం ఓటర్లను చైతన్య పరచడం, ప్రభుత్వ పాలనలో వారిని చైతన్య పరచడంపై ఓటర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మోహనరావు మాట్లాడుతూ వజ్రం కంటే ఎంతో విలువైన ఓటును ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వివిధ పార్టీల నాయకులు ఇచ్చే మద్యం, నగదుకు ఏ ఒక్క ఓటరు బానిసలు కాకుండా తమకు ఇష్టం ఉన్న నాయకులను ఎంతో పవిత్రమైన ఓటుతో గెలిపించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా మోడల్ పోలింగ్ స్టేషన్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం ఓటు హక్కుపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ పార్వతి, ఎంపీడీఓ పి.రామకృష్ణ, ఈఓపీఆర్డీ జవహర్ లాల్ నెహ్రూ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రమేష్, పంచాయతీ కార్యదర్శులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బూర్లపై అసమ్మతి జ్వాలలు

- వట్టిచెరుకూరు మండలం ముట్లూరులో శుక్రవారం రాత్రి ఆత్మీయ సమావేశం పేరుతో బూర్ల అసమ్మతి వర్గం సమావేశం
- హాజరైన అసమ్మతి నాయకులు, శ్రేణులు
- ఎన్నికల వేళ పెరుగుతున్న అసమ్మతి హీట్

ప్రత్తిపాడు: తెలుగుదేశం పార్టీ అభ్యర్థి బూర్ల రామాంజనేయులుపై అసమ్మతి జ్వాలలు ఎగసి పడుతున్నాయి. బూర్ల సమన్వయకర్తగా నియోజకవర్గంలోనికి అడుగు పెట్టిన నాటి నుంచి గ్రూపులను ప్రోత్సహిస్తూ, ఏకపక్షంగా వ్యవహరిస్తుండటంతో పార్టీ నేతలు రగిలిపోతున్నారు. బూర్ల మాకొద్దు‘బాబోయ్’ అంటూ నెత్తీ నోరూ బాదుకుంటున్నారు. తాజాగా వట్టిచెరుకూరు మండలం ముట్లూరులో శుక్రవారం రాత్రి బూర్ల వ్యతిరేక వర్గం భారీ సమావేశం నిర్వహించారు. పేరుకు ఆత్మీయ సమావేశమే అయినా తెరవెనుక మాత్రం అసమ్మతి సమావేశమే. ఈ సమావేశానికి నియోజకవర్గంలోని ఐదు మండలాల నుంచి బూర్ల వ్యతిరేక వర్గం పెద్ద ఎత్తున హాజరయ్యింది. ఈ సమావేశంలో రానున్న ఎన్నికల్లో రామాంజనేయులుకు ఎలా చెక్ పెట్టాలి? ఏ విధంగా ఆయనను ఓడించాలి? అందుకు తీసుకోవలసిన చర్యలపై సుదీర్ఘంగా ముఖ్య నేతలు చర్చించినట్లుగా తెలుస్తోంది. ఇదిలా ఉంటే ఇదే మండలంలో టీడీపీ అభ్యర్థి కుటుంబ సాధికార సారథులకు సమావేశం నిర్వహించిన సమయంలోనే, అటు అసమ్మతి వర్గం కూడా ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించడం పెద్దఎత్తున చర్చనీయాంశమయ్యింది.

ఇదే వర్గం గతంలో భారీ ర్యాలీతో..

గతంలో ఇదే వర్గం భారీ ర్యాలీతో రామాంజనేయులుపై బహిరంగంగానే అసమ్మతి బావుటా ఎగురవేసింది. ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమాన్ని పురస్కరించుకుని నియోజకవర్గంలోని ప్రత్తిపాడు, పెదనందిపాడు, కాకుమాను, వట్టిచెరుకూరు, గుంటూరురూరల్ మండలాల్లోని అసమ్మతి నాయకులంతా వందల కార్లతో భారీ ర్యాలీ చేపట్టి ఎన్టీఆర్‌కు నివాళులర్పించారు. కనీసం ఈ కార్యక్రమానికి బూర్లను ఆహ్వానించకుండా, ఫ్లెక్సీలు, పోస్టర్లలో ఆయన ఫొటోలు లేకుండా వేర్వేరుగా బూర్ల వర్గం, వ్యతిరేక వర్గాలు వర్ధంతి కార్యక్రమాలను నిర్వహించాయి. వట్టిచెరుకూరు మండలంలోని నాయకులు కీరోల్ పోషిస్తున్నారు.

గతంలోనే అనేక అసమ్మతి సెగలు..

ఇప్పటికే పెదనందిపాడు మండలంలోని రెండు వర్గాల్లో ఒక వర్గాన్ని దూరం పెట్టి, మరో వర్గాన్ని చేరదీస్తుండటంతో ఆ రెండు వర్గాలు బహిరంగంగానే ఢీ అంటే ఢీ అంటున్నాయి. టీడీపీ అధినేత రాక సందర్భంగా ఆదే గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఇరు వర్గాలు చొక్కాలు పట్టుకుని తన్నుకున్నాయి. అంతటితో ఆగకుండా పెదనందిపాడుకు బాబొచ్చిన రోజు నడిరోడ్డుపై బాహాబాహీకి దిగి మరోసారి రోడ్డుపైనే కొట్లాడుకున్నారు. అనంతరం గుంటూరురూరల్ మండలంలో కూడా టీడీపీ శ్రేణులు బూర్ల తీరుపై నిప్పులు చెరుగుతున్నాయి. ఆర్ ఆర్ (రత్తయ్య, రామాంజనేయులు) మాకు వద్దంటే వద్దు అంటూ.. పార్టీ నేతలు నిర్వహించిన సమావేశంలో ప్లకార్డులు ప్రదర్శించి మరీ బహిరంగంగానే తమ నిరసనను వ్యక్తం చేసిన విషయం తెలిసిందే.